# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 15-07-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ప్రభుత్వం పేరుతో వచ్చే నకిలీ ఈ-మెయిళ్లపై అప్రమత్తంగా ఉండాలని కేంద్రప్రభుత్వం సూచించింది.**
2. **ఎర్రచందనం, మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర డీజీపీ ద్వారకా తిరుమలరావు తెలిపారు.**
3. **ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో సాగునీరు సంక్రమంగా అందించేందుకు చర్యలు చేపట్టామని శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు.**
4. **ప్రపంచ వ్యాప్తంగా యువతలో నైపుణ్యాలను పెంపొందించే ఉద్దేశ్యంతో ఈరోజు ప్రపంచ యువజన నైపుణ్య దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.**

==============================

ప్రభుత్వం పేరుతో ఈ-మెయిళ్లలో వచ్చే నోటీసులకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం కీలక సూచనలు చేసింది. అందులో పేర్కొన్న అధికారి వివరాలను ఇంటర్నెట్‌లో లేదా అందులో పేర్కొన్న శాఖ ద్వారా ధ్రువీకరించుకోవాలని ప్రజలకు సూచించింది. నకిలీ ఈ-మెయిళ్లపై అప్రమత్తంగా ఉండాలని పేర్కొంటూ కేంద్ర హోంశాఖ పరిధిలోని సైబర్ క్రైం విభాగం తాజాగా ఓ సూచన జారీ చేసింది. ఈ-నోటీసులపై అప్రమత్తంగా ఉండాలని.. అనుమానాస్పద మెయిళ్లను క్లిక్ చేయడం, స్పందించే సమయంలో జాగ్రత్తలు పాటించాలని సూచించింది. మెయిల్ చివర gov.in ఉందో లేదో సరి చూసుకోవాలని తెలిపింది.

---------------------------

ఎర్రచందనం, మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర డీజీపీ ద్వారకా తిరుమలరావు తెలిపారు. చిత్తూరు జిల్లా కాణిపాకంలో నిన్న ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ ఇతర రాష్ట్రాల నుంచి అక్రమంగా తరలుతున్న మద్యాన్ని అడ్డుకుంటామన్నారు. గ్రామాల్లో నాటు సారా తయారీ, విక్రయాలను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపడతామని వివరించారు. దీనికోసం చెక్ పోస్టులను బలోపేతం చే సి, వాహనాలను తనిఖీ చేస్తామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా చిన్నపిల్లలు, మహిళల భద్రతకు పటిష్ఠ చర్యలు చేపడతామని వెల్లడించారు. నేరాలను అదుపులో ఉంచేందుకు సీసీ కెమేరాలు, డ్రోన్లు, డిజిటల్ ఫోరెన్సిక్ పరికరాలను విస్తృతంగా వినియోగిస్తామని చెప్పారు.

---------------------------

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్లో రైతులకు కావలసిన సాగునీరు సంక్రమంగా అందించేందుకు చర్యలు చేపట్టామని శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. శ్రీకాకుళం జెడ్పీ సమావేశ మందిరంలో ఈరోజు నిర్వహించిన మీ కోసం ప్రజా పిర్యాదులు పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ జలవనరులు, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు సమన్వంతో పనిచేసి ఖరీఫ్ సీజన్లో రైతులకు సాగునీరు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. సాగునీటి సౌకర్యం కల్పించాలని కోరుతూ జిల్లా రైతులు వస్తున్నారని ఈ పరిస్థితిని చక్కదిద్దాలని ఆయన అధికారులను కోరారు.

---------------------------

ఇసుక అక్రమ తవ్వకాల వ్యవహారంపై విచారణను సుప్రీంకోర్టు ఆగస్టు 2వ తేదీకి వాయిదా వేసింది. ఇసుక అక్రమ తవ్వకాల వ్యవహారంపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన అఫిడవిట్‌పై సుప్రీంకోర్టు ధర్మాసనం ఈ రోజు విచారణ చేపట్టింది. అయితే తాము మరిన్ని వివరాలు కోర్టు ముందుంచేందుకు కొంత సమయం కావాలని రాష్ట్ర ప్రభుత్వం కోరింది. గతంలో అధికారులు దాఖలు చేసిన నివేదికలపై అనుమానాలున్నాయని, వాస్తవాలు దాఖలు చేయలేదని మీడియాలో కూడా వార్తలొచ్చాయని రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. నివేదికలన్నీ పునఃపరిశీలించి ఆధారాలతో వివరాలు సేకరిస్తామని తెలిపింది. పూర్తి వివరాలన్నీ కోర్టు ముందు ఉంచుతామని ప్రభుత్వం తరపు న్యాయవాదులు చెప్పారు. దీంతో సుప్రీంకోర్టు విచారణను వాయిదా వేసింది.

---------------------------

అనకాపల్లి జిల్లా నర్సీపట్నం మండలం గప్పాడ డిపోలో ఇసుక నిల్వలకు లెక్కలు లేకపోవడంపై స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు విస్మయం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఇసుక డిపోను ఆయన ఈరోజు పరిశీలించారు. 63వేల మెట్రిక్ టన్నుల నిల్వలపై దర్యాప్తు చేసి, వివరాలు తెలియజేయాలని గనులశాఖ డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్‌ను స్పీకర్ ఆదేశించారు. దీనిపై కేసు నమోదు చేసి నిందితులను తక్షణమే అరెస్ట్ చేయాలన్నారు. ఆ తర్వాతే ఇసుక ప్రజలకు సరఫరా చేయాలని సూచించారు.

---------------------------

తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో రేపు సాలకట్ల ఆణివార ఆస్థానం జరుగనుంది. ఈ నేపథ్యంలో ఆలయంలో విశేష పూజలను తిరుమల తిరుపతి దేవస్థానం వేద పండితులు నిర్వహించనున్నారు. రేపు సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత మల్లయప్పస్వామి వారు పుష్పపల్లకిపై తిరువీధుల్లో విహరించనున్నారు. ఆణివార ఆస్థానం జరుగనున్న నేపథ్యంలో అష్టదళ పాదపద్మారాధన, కళ్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకరణ సేవలను తిరుమల తిరుపతి దేవస్థానం రద్దు చేసింది.

---------------------------

ప్రపంచ వ్యాప్తంగా యువతలో నైపుణ్యాలను పెంపొందించే ఉద్దేశ్యంతో ఈరోజు ప్రపంచ యువజన నైపుణ్య దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఐక్య రాజ్య సమితి పిలుపు మేరకు ప్రతి ఏటా జూలై 15 వ తేదీన ఈ కార్యక్రమం జరుగుతోంది. ఐక్య రాజ్య సమితి, ప్రభుత్వ, ప్రైవేటు రంగ సంస్థలు, పౌర సమాజ ప్రతినిధులు, యువతను ఒక వేదికపై చేర్చి యువతలోని ప్రతిభా పాటవాలను, నైపుణ్యాన్ని వెలికితీసి ప్రపంచ సమగ్రాభివృద్ధిలో వారిని భాగస్వాములను చేయడమే ఈ కార్యక్రమ నిర్వహణలోని ముఖ్యోద్దేశం.

యువత నైపుణ్యాలను వెలికి తీయడంలో ప్రపంచ వ్యాప్తంగా భారత దేశం ముందంజలో వుంది. ఈ దిశగా కేంద్రంలోని ఎన్.డి.ఎ. ప్రభుత్వం తగినంతగా నిధులు కేటాయించి యువతలో నైపుణ్యాలను వెలికి తీసే కార్యక్రమాలను పెద్ద ఎత్తున చేపడుతోంది. ఈ కార్యక్రమాలను అందిపుచ్చుకుంటున్న యువత మన దేశంలోనే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా ఆయా దేశాల జీవన స్రవంతిలో పాలు పంచుకుంటున్నారు.

-------------------------

జల్ జీవన్ పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వ నిధులు మంజూరు చేయించి కైకలూరులో తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ తెలిపారు. ఇటీవలి సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించిన ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్, కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్‌ల అభినందన సభ నిన్న సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మహేష్ కుమార్ మాట్లాడుతూ కొల్లేరును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానన్నారు. ఏలూరులో వందేభారత్ రైలు స్టాపు ఏర్పాటుకు కేంద్రంతో చర్చలు జరిపామని వెల్లడించారు. ఏలూరులోని జిల్లా ఆసుపత్రిని కేంద్ర నిధులతో ఆధునికరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమనికి ముఖ్యఅతిథులుగా రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి, గనులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర హాజరయ్యారు.

-------------------------

భారత్, శ్రీలంకల మధ్య రామసేతు వంతెన కాల్పనికం కాదని.. నిజమేనని భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రో తెలిపింది. ఇస్రో శాస్త్రవేత్తలు అమెరికాకు చెందిన ఉపగ్రహం ఐస్‌శాట్-2 డేటాను వినియోగించి తమిళనాడులోని ఈ వంతెనకు సంబంధించిన మ్యాప్‌ను విడుదల చేశారు. భారత్, శ్రీలంక మధ్య ఉండే ఈ వంతెన పొడవు 29 కిలో మీటర్ల మేర ఉంది. దీని ఎత్తు సముద్రగర్భం నుంచి 8 మీటర్లు ఉన్నట్లు నిర్ధారించారు. ఈ వంతెన తమిళనాడులోని రామేశ్వరం ద్వీపం ఆగ్నేయ దిక్కులోని ధనుష్కోడి నుంచి శ్రీలంక మన్నారు ద్వీపంలోని తలైమన్నార్ వాయవ్య దిశ వరకు విస్తరించి ఉంది. దీనిని సున్నపురాతితో నిర్మించినట్లు తెలుసుకున్నారు. ప్రస్తుతం ఈ సేతువు 99.98 శాతం నీటిలో మునిగిందని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు.

-------------------------

భారత వైమానిక దళంలో చేరడానికి ఆసక్తి ఉన్న, తగిన విద్యార్హత కలిగిన యువత నుంచి "అగ్నివీర్వాయుని" పోస్టుల భర్తీకి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. ఆమేరకు దరఖాస్తు, పరీక్షకి హాజరైయ్యే విధానం పై విమానయాన సంస్థ అధికారులు వివరాలు తెలియజేశారన్నారు. మరిన్ని వివరాలు, దరఖాస్తు కోసం https://agnipathvayu.cdac.in వెబ్ పోర్టల్‌ను సందర్శించాలని కలెక్టర్ సూచించారు.

-------------------------

నూతన విద్యా విధానం కింద ఏర్పాటు చేసిన పీఎం ఎక్సలెన్స్‌లతో విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంపొందుతాయని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా పేర్కొన్నారు. మధ్యప్రదేశ్‌లోని మొత్తం 55 జిల్లాల్లో 'ప్రధానమంత్రి కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్స్'లను అమిత్ షా నిన్న ప్రారంభించారు. ఇండోర్‌లోని వాజ్‌పేయీ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమిత్ షా మాట్లాడుతూ.. ఇండోర్ నగరం విద్యాకేంద్రంగా అవతరించడం సంతోషంగా ఉందన్నారు.

-------------------------

రాష్ట్రంలోని ప్రస్తుత వాతావరణ పరిస్థితులను అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారి ఎం.వెంకట్రావు కొద్దిసేపటి క్రితం ఆకాశవాణి విజయవాడ కేంద్ర ప్రాంతీయ వార్తావిభాగానికి తెలియజేస్తూ......

.....వాయిస్.... 45 సెకన్లు....

---

వెయ్యి మందికి పైగా అభ్యర్థులకు ఈ నెల 19వ తేదీన మరోసారి సీయూఈటీ–యూజీ పరీక్షను నిర్వహించాలని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఎన్‌టీఏ నిర్ణయించింది. ఈ మేరకు నిన్న నోటిఫికేషన్ విడుదల చేసింది. పరీక్ష కేంద్రంలో తొలుత తాము ఎంపిక చేసుకోని భాషలో ప్రశ్నపత్రాలు పంపిణీ చేశారని, ఆ తర్వాత వాటిని వెనక్కి తీసుకొని సరైనవి ఇచ్చారని, దీనివల్ల సమయం వృథా అయిందంటూ కొందరు అభ్యర్థుల నుంచి ఫిర్యాదులు వచ్చినట్లు ఎన్‌టీఏ వర్గాలు తెలిపాయి. ఈ నేపథ్యంలో వారికి మరోసారి పరీక్షను కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ సీబీటీ విధానంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నాయి. ఈ వెయ్యి మంది అభ్యర్థులు ఆరు రాష్ట్రాలకు చెందినవారు.

---

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్” మనసులోని మాట కార్యక్రమం 112వ సంచిక ఈనెల 28వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది.“మన్ కీ బాత్” కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈనెల 26వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

======================